అన్నదాతకు వెన్నుపోటు





వరి చేను కోస్తున్న రైతు కూలీలు

- రైతన్నను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ ఊసెత్తని వైనం
- అందని రూ.20 వేల పెట్టుబడి సాయం



రబీ సాగుకు పొలాలు సిద్ధం చేసిన రైతులు

ఎల్.ఎన్.పేట: పొలాన్ని నమ్ముకుని కష్టపడి పంట పండించే రైతన్నకు కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ప్రతీ ఏడాది పంట పెట్టుబడి కోసం రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబుతోపాటు కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో రైతులను నమ్మించారు. అన్ని బహిరంగ సభల్లోనూ రైతులను ఆదుకుంటామనే ప్రచారాన్ని హోరెత్తించారు. సూపర్ సిక్స్ హామీలు అందజేస్తామని ఇంటింటికీ వెళ్లి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. హామీల అమలు చేయకుండా మోసం చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ పూర్తి..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు ప్రభుత్వం వైపు ఆశగా చూశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేల పెట్టుబడి సాయం అందుతుందని అనుకున్నారు. రోజులు, వారాలు, నెలలు.. చివరకు ఖరీఫ్ సాగు సీజన్ పూర్తయింది. రైతుల బ్యాంకు ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు జమకాలేదు. పంట పెట్టుబడి కోసం రైతులకు తాహతకు మించి అప్పులు చేసి వడ్డీలు చెల్లించుకుంటున్నారు. చంద్రబాబుని నమ్ముకుంటే అప్పులపాలు కావాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జగనన్న పాలనలో..

2019 నుంచి 2023 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో రైతులకు పెట్టుబడి సాయంగా అర్హత ఉన్న ప్రతీరైతుకు రైతు భరోసా కింద రూ.13,500 ఇచ్చారు. కరోనా మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించలేకపోయినా అన్ని పథకాలనూ అమలు చేశారు.

అప్పులు చేశాం



చంద్రబాబు అధికారంలోని వస్తే రైతులకు పెట్టుబడి కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు ఇస్తామన్నారు. పంట సాగు కాలంలో పెట్టుబడి సాయం డబ్బులు రాలేదు. పంట పండించేందుకు ఎరువులు, పురుగు మందులతోపాటు ఇతర అవసరాల కోసం వడ్డీలకు అప్పులు చేశాం. పంట చేతికి వచ్చింది ఇప్పుడు వడ్డీలతో అప్పులు తీర్చుతున్నాం.

– మామిడి ఆదినారాయణ, రైతు, తంప, హిరమండలం

ఈ ఏడాదికి మరి లేనట్టే



ప్రభుత్వం ఇస్తామని చెప్పిన అన్నదాత సుఖీభవ పథకం ఈ ఏడాదికి ఇక లేనట్లే అనిపిస్తుంది. ఖరీఫ్ సీజన్ ముగిసిపోవడంతో ఇవ్వక పోవచ్చు. గతంలోనూ చంద్రబాబు అధికారంలోనికి రావాలని అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయలేదు. ఇప్పుడు కూడా ఆదే పరిస్థితి.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందజేసిన రైతు భరోసా లబ్ధి (రూ.కోట్లలో) వివరాలు..

మండలం	హిరమండలం	కొత్తూరు	ఎల్.ఎన్.పేట	మెళియాపుట్టి	పాతపట్నం
రైతులు	5,648	10,961	5,890	9,597	9,183
జమ చేసిన మొత్తం	రూ.13.0	రూ.24.5	రూ.13.5	రూ.23.5	రూ.22.5

రైతు సమస్యలపై పోరాటానికి తరలిరండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

సారవకోట: రైతుల సమస్యలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న పోరాటానికి ప్రతిఒక్కరూ తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ కోరారు. గురువారం అలుదు గ్రామంలో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసన్నపేట మండలంలోని మడపాం నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, ఇసై షణ్ముఖరావు, పార్టీ నాయకులు వరుదు దేవీ ప్రసాద్, పల్లి కృష్ణారావు, యాళ్ల శ్యామసుందరరావు, తాడేల రామదాసు, రావాడ శ్రీనివాసరావు, కోరాడ అప్పయ్య, కొండాల రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం



కె.వి.జి సత్యనారాయణకు సత్కరిస్తున్న రెడ్డి శాంతి, పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా నియమితులైన కె.వి.జి.సత్యనారాయణకు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి దుశ్శాలువతో సత్కరించారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ పార్టీకోసం అంకిత భావంతో పనిచేస్తున్న సత్యనారాయణకు పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

సరుబుజ్జిలి: ఈ నెల 14న నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ ఎల్.మధుసూదన గురువారం తెలిపారు. ఓటు హక్కు కలిగిన రైతులకు ఆదేరోజు సూచించిన ప్రదేశాల్లో ఆయా టీసీలకు సంబంధించిన సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రైతులు తమ ఓటు హక్కు కలిగిన టీసీల వారీగా సమావేశాలకు హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణదాస్‌ను కలిసిన బూర్లె శ్రీనివాసరావు



కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు గురువారం శ్రీకాకుళంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషిచేయాలని శ్రీనివాస్‌కు కృష్ణదాస్ సూచించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ నెల 13న రైతు సమస్యలపై పార్టీ నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రసాద్

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆర్.ఎస్.ప్రసాద్ గురువారం పరిశీలించారు. మీటింగ్ హాల్ మరమ్మతులు చేయడానికి అంచనా తయారు చేయాలని ఏఈ ఆనంద్‌కు సూచించారు. ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా, ఏపీఓ టి.రవి, వర్క్ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వసంత ఉన్నారు.

వాబ యోగికి గద్దర్ జాతీయ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వాబ యోగి

సారవకోట: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి గద్దర్ జాతీయ సేవా పురస్కారాన్ని గద్దర్ కుమార్తె వెన్నెల చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేశారు.

లీజు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సిర్ల ప్రసాదరావు

కొత్తూరు: మండలంలోని నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ భవనంతోపాటు 25 సెంట్లకు 10 ఏళ్లపాటు ఇచ్చిన లీజ్‌ను రద్దుచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరులో గురువారం విలేకర్లతో మాట్లాడారు. కాంప్లెక్స్ భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లీజు పేరుతో ధారాదత్తం చేయడం దారుణమన్నారు. ప్రయాణికుల కోసం నిర్మించిన కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయకుండా ఆదాయం పేరుతో లీజ్‌కు ఇవ్వడం సరికాదన్నారు. పలాస నుంచి కొత్తూరు, భువనేశ్వర్ నుంచి నవరంగపూర్‌తోపాటు జిల్లా నుంచి ఎన్నో బస్సులు రాకపోకలు చేస్తున్న కాంప్లెక్స్‌ను లీజ్‌కు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాంప్లెక్స్‌కు అనుకొని ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థులతోపాటు ప్రయాణికులు వర్షం వస్తే ఎక్కడ ఉంటారని ఆర్టీసీ అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని లీజ్‌ను రద్దు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, లోపింటి చిన్నారావు ఉన్నారు.

పరిహారం ఇప్పించండి



తమ భూములకు పరిహారం ఇప్పించాలని సారవకోట మండలం బెజ్జి గ్రామానికి చెందిన పల్లి అప్పారావుతోపాటు పలువురు రైతులు కోరారు. గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. 1983లో నవరబెజ్జి నుంచి కొమ్మసరియాపల్లి వరకు రోడ్డు నిర్మించారని, ఆ సమయంలో 50 మంది రైతులు సుమారు 4 ఎకరాల జిరాయితీ కోల్పోయామన్నారు. అప్పటి నుంచి నేటివరకు దీనిపై ఎంతో మంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు బాలరాజు, కృష్ణారావు, అటవీశాఖ బీట్ అధికారి శివ ప్రసాద్, సర్పంచ్ పోలాకి చిన్నబాబు ఉన్నారు.

– సారవకోట

పరిశీలన



మెళియాపుట్టి మండలం నడసంద్ర గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా గురువారం పరిశీలించారు. పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడానికి తడి, పొడి చెత్తలను వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు అందిస్తే వారు చెత్త కేంద్రానికి తీసుకువెళ్తారన్నారు. చెత్తతో సేంద్రీయ ఎరువులు తయారుచేసి రైతులకు విక్రయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. రహదారులపై పశువులు కట్టవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

– మెళియాపుట్టి

ప్రయాణ కష్టాలు..



ప్రతిరోజూ సాయంత్రం పాతపట్నం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న బస్టాండ్ వద్ద బస్సుల కోసం విద్యారులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. విద్యార్థినుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. హిరమండలం, టెక్కలి, తదితర మార్గాల్లో మరింత రద్దీగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. స్కూళ్లు, కళాశాలలు ఒకేసారి విడిచిపెడుతున్నారు. గతంలో హిరమండలానికి చెందిన విద్యార్థి బస్సు ఎక్కుతూ జారిపడి గాయపడ్డాడు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– పాతపట్నం

ప్రజాధనం వృథా..



సారవకోట మండలంలోని వాండ్రాయి పంచాయతీలో వాండ్రాయి, బెజ్జి గ్రామాలకు మధ్యలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించారు. అప్పటినుంచి ఈ కేంద్రాన్ని ఒక్కసారైనా వినియోగించ లేదు. ఈ నిర్మాణం పూర్తిగా పాడవడంతో గురువారం తొలగించే చర్యలు చేపట్టారు. రూ.లక్షల్లో ప్రజాధనం వృథా కావడంపై అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.

– సారవకోట

చెత్త నుంచి సంపద తయారుచేయాలి



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీఎల్పీఓ రమణ

బూర్జ: మండలం కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్పీఓ బి.వి.రమణ గురువారం పరిశీలించారు.

ఈ కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువులు తయారుచేయాలన్నారు. వీటిని పంటలకు వినియోగించడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి.కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 2 గంటల వరకు గాంధీనగర్, సంతపేట, పురుషోత్తం నగర్, దేశవానిపేట, వివీనగర్ కాలనీ, వజ్రంపేట, పసారు వీధి, ఆదివరపుపేట, నక్కవీధి, వీరన్నాయుడు కాలనీ, బొంతల వీధి, తిరుమల వీధి, కామేశ్వరీ నగర్, బొరిగివలస, ఈదులవలసల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పొందూరులో..

పొందూరు: మండల కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ ఈఈ పైడి యోగీశ్వరరావు గురువారం తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



యంత్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద దోమల నివారణకు వినియోగించే రెండు ఫాగింగ్ యంత్రాలు, 7 స్ప్రేయర్లను గురువారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మేనేజర్ బిసాయ్, పి.వి.వి.కె.రాజు, చక్రవర్తి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

నరసన్నపేట: యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నియోజకవర్గంలో మాదకద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలని పోలీసు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో యువతకు గురువారం ప్రత్యేక అవగాన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, ఎంపీడీఓ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళాలో సిక్కోలు ఉత్పత్తులు



సిక్కోలు ఉత్పత్తులను చూపిస్తున్న అధికారులు

ఆమదాలవలస: విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కళాశాలలో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో జిల్లా నుంచి సహజ సేద్య పద్ధతులలో సాగు చేస్తున్న పలు రకాల ఉత్పత్తులను స్టాల్స్‌లో పెట్టి విక్రయించడం జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి గురువారం తెలిపారు. జిల్లా నుంచి ఆమదాలవలస మండలం చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లువాడ నుంచి బెల్లం, బూర్జ యూనిట్ నుంచి చిరుధాన్యాలు, పప్పు దినుసులు, ఆర్గానిక్ దేశీ రకాల బియ్యం, వివిధ రకాల దేశి ఉత్పత్తుల నుంచి తయారుచేసిన వస్తువులను స్టాల్స్‌లో పెట్టామన్నారు. ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు మేళా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని తిడ్డిమి గ్రామానికి చెందిన వ్యక్తి ఆరు మద్యం బాటిళ్లను అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ బి.లావణ్య గురువారం తెలిపారు. అతనిపై గతంలో కూడా మద్యం కేసు ఉన్నందున రిమాండ్‌కు తరలించామన్నారు.

కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ఎంపీడీఓకు అందజేస్తున్న కార్యవర్గం జాబితా

పొందూరు: పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పొందూరు పంచాయతీ ఈఓ కె.మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా పి.జగదీష్, ఉపాధ్యక్షులుగా పైల శ్రీరాములు, రుద్రవేని, కోశాధికారులుగా శ్రీనురెడ్డి, వై.విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. మండల కార్యవర్గం జాబితాను ఎంపీడీఓ మన్మధరావుకు అందజేశారు.